అటకెక్కిన పాలిథిన్ నిషేధం

- ఎక్కడికక్కడ యథేచ్ఛగా వినియోగం
- ఎక్కడ చూసినా గుట్టలుగా దర్శనమిస్తున్న వైనం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు



పాలిథిన్ బ్యాగ్‌తో సరకులు తీసుకువెళుతున్న దృశ్యం



చాగల్లులో పడేసిన పాలిథిన్ వ్యర్థాలు

చాగల్లు: జీవకోటి మనుగడకు ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వాటి నిర్మూలనకు గతంలో అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ కథ మళ్లీ మొదటికొచ్చింది. ప్లాస్టిక్ నిషేధం ప్రస్తుతం ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ వస్తువులను, సంచులను మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగం పర్యావరణ పరిరక్షణకు పెనుభూతంగా మారింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. ఉదయం బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా, ఇంటికి సరకులు తీసుకు వెళ్లాలన్నా అన్నింటికీ పాలిథిన్ కవర్లనే వాడుతున్నాం. వాటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మానడం లేదు. పాలిథిన్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా ఎక్కడా అమలు కావడం లేదు. అప్పుడప్పుడూ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి, చేతులు దులుపుకుంటున్నారు.

యథేచ్ఛగా విక్రయాలు

పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు నియోజకవర్గంలోని కొవ్వూరు మున్సిపాలిటీతో పాటు చాగల్లు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో యథేచ్ఛగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో రోజుకు సుమారు టన్ను వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. గతంలో 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై గ్రామస్థాయి నుంచి నిషేధాన్ని అమలు చేశారు. వాటిని విక్రయించే వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేసి హడావుడి చేసి జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం అప్పట్లో చాలా వరకూ తగ్గింది. పాలిథిన్ సంచుల వాడకానికి బదులుగా గుడ్డ కవర్లు, వస్తువులను ఉపయోగించారు. తరువాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాసిక్ కవర్లు, వస్తువుల వినియోగం ఎక్కువైంది. ప్రతి దుకాణంలోను, చికెన్ సెంటర్లలోను, బేకరీలు, హోటళ్లలోను, కర్రీ పాయింట్లలోను, విందుల్లోను, బార్ల వద్ద పాలిథిన్ వాడకాలు విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. వాటిని రోడ్లపైన, గ్రామ పరిసర ప్రాంతాల్లో పడేస్తున్నారు. వీటి వలన అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పాలిథిన్ తయారీలో ప్రమాదకరమైన పెట్రో కెమికల్స్‌ను వినియోగిస్తారు.

నీటి మట్టాలు పడిపోయే అవకాశం

ఆవులు, మేకలు, ఎద్దులు పాలిథిన్ కవర్లను తిని మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. పాలిథిన్ కవర్లు భూమిలో కరగడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. దీనివలన భూగర్భ జలాలు అడుగంటే ముప్పు కూడా ఉందని పలువురు భూగర్భజల శాఖ నిపుణులు చెబుతున్నారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో అనారోగ్య కారణాల వలన మరణించిన ఆవు పొట్టలో 40 కిలోల ప్లాస్టిక్ సంచులు బయట పడిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది.

క్యాన్సర్ వచ్చే ప్రమాదం

వేడి ఆహార పదార్థాలను (వేడి ఫాస్ట్‌ఫుడ్) ప్లాస్టిక్ సంచుల్లో తీసుకుని వెళ్లడం వల్ల పాలీ ఇథలిన్, పాలీ హిస్టరీస్ వంటి రసాయనాలు కరగి ఆహార పదార్థాల్లో కలసి పోతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.దీని ద్వారా క్యాన్సర్, తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాలిథిన్‌కు బదులుగా ఇతర వస్తువులను వాడేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలంటున్నారు. పర్యవరణానికి ముప్పు వాటిల్లే పాలిథిన్ విక్రయాలపై అధికారులు తనిఖీలు చేపట్టాలని, వాటిని అమ్మేవారిపైనే గాకుండా తయారీ సంస్థలపై కూడా దృష్టి సారించాలని, అప్పుడే నిషేధం సక్రమంగా అమలవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వ్యాపారులకు నోటీసులు ఇస్తున్నాం

పాలిథిన్ విక్రయాలు చేస్తున్న వ్యాపారులకు నోటీసులు ఇస్తున్నాం. పాలిథిన్‌కు ప్రత్యామ్నాయంగా కాగితం వస్తువులు, గుడ్డ సంచులు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం

–ఎస్. బుజ్జి, ఎంపీడీవో, చాగల్లు

నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. వీటిని విక్రయించే వారిపై, 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కవర్ల పాలిథిన్ కవర్లు తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ వలన పర్యావరణానికి తీవ్రం నష్టం కలుగుతోంది. వాటిని వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలి.

–బండి అశోక్‌బాబు, చంద్రవరం, చాగల్లు మండలం

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

- డీఎంఅండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు
- తాళ్లపూడిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తనిఖీలు



తాళ్లపూడిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో వివరాలు సేకరిస్తున్న ఎస్‌వో కుమారస్వామి



తాళ్లపూడిలో మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి: నిబంధనలకు విరుద్ధంగా పని చేసే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తప్పదని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. కనీస నిబంధనలు పాటించడం లేదంటూ తాళ్లపూడిలోని అశోక హాస్పిటల్‌పై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీఎంఅండ్ హెచ్‌వో తాళ్లపూడి వచ్చి ఆ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఈ ఆసుపత్రి సిబ్బంది నుంచి ఆయన వివరాలు సేకరించారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రి నడపడానికి ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలన్నింటినీ విధిగా పాటించాలన్నారు. ఫైర్ నిబంధనలు పాటించాలని, ఆసుపత్రి వ్యర్థాలను బయోవేస్ట్‌గా ఉపయోగించాలని, కాలుష్యం రాకుండా చూడాలన్నారు. వైద్య సేవలు సక్రమంగా అందించి, వాటికి బిల్లులు ఇవ్వాలన్నారు. అర్హత గల సిబ్బందిని మాత్రమే నియమించుకోవాలన్నారు. రేడియాలజిస్ట్ లేకుండా స్కానింగ్ చేస్తున్నట్టు, ఆస్పత్రిలోని మెడికల్ షాప్‌లో మందులకు ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో వెంట ఎస్‌వో కుమారస్వామి, సిబ్బంది ఈ ఆస్పత్రిలో విచారణ చేపట్టారు.

ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభం



కుమారదేవంలో ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు



తీపర్రులో ఇసుక పంపిణీని ప్రారంభిస్తున్న పెరవలి తహసీల్దార్ సుధ, ప్రజాప్రతినిధులు

కొవ్వూరు: సామాన్యులకు ఇసుక అందుబాటులోకి తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కుమారదేవరం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉచిత ఇసుక పంపిణీని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇళ్లు నిర్మించుకునేవారికి ఇబ్బందులు లేకుండా ఉచితంగా ఇసుక పంపిణీని అందుబాటులోకి తెచ్చామన్నారు. టన్ను ఇసుక ధర రూ.275గా నిర్ణయించినట్టు తెలిపారు. సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాత్సవ మాట్లాడుతూ ఒక వ్యక్తికి రోజుకు గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నుల ఇసుకను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని ,వట్టికూటి వెంకటేశ్వరరావు,నామన పరమేశ్, కాకర్ల నారాయుడు, టీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: ఇసుక పంపిణీని పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని తహసీల్దార్ డి.సుధ అన్నారు. మండలంలోని తీపర్రులో ఇసుక అమ్మకాలను అధికారులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుధ మాట్లాడుతూ తీపర్రు వద్ద 33,065 టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. టన్ను ఇసుక ధరను రూ.270 లుగా ప్రభుత్వం నిర్ణయించిన తెలిపారు. ఇసుక కావాల్సిన వారు తమ ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్, అడ్రస్, వాహనం నంబరు ఇవ్వాలన్నారు. అలాగే లబిదారులు సొమ్మును నేరుగా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. ప్రతి ఒక్కరికీ రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే సరఫరా చేస్తారన్నారు. ఇసుక అమ్మకాలు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే జరపాలని ఇందు కోసం డిప్యూటీ తహసీల్దార్ నియమించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.మహేశ్వరి, నాయకులు, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరి చేలలో కలుపు నివారణ చేపట్టండి

రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సూచన



నల్లజర్లలో వరి చేలను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం

నల్లజర్ల: మండలంలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాట్లు పూర్తయిన వరిచేలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. వరి చేలలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త నరసింహరాజు సూచించారు. నాటిన మూడు రోజుల తర్వాత బ్యూటాక్లోర్ (కొలంబస్)1.25 మందును లేదా ప్రిటిలాకోర్ మందును 600 మిల్లీ లీటర్‌ను 25 కిలోల ఇసుకలో కలిపి చల్లాలన్నారు. నాటిన 8–10 రోజులకు పైరజోసల్ఫ్యూరాన్ ఇథైల్ 80 గ్రాముల మందును పిచికారీ చేయాలన్నారు. నాట్లు వేసిన 15–20 రోజులలో తుంగ కన్పిస్తే నివారణకు బిస్ పైరిబాక్ సోడియం మందును 80–120 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హైమాజ్యోతి, పి.అమ్మాజీ, మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత, వ్యవసాయ సహాయకులు రామకృష్ణ, సురేష్, ప్రభాకర్, రైతులు యలమాటి శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి గాంధీ, కూచిపూడి గంగరాజు, బుడిగిన ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్
- కె.సావరం పాఠశాల విద్యార్థులకు గొడుగుల పంపిణీ
- పాఠశాలలోను, గ్రామంలోను వన మహోత్సవం



కె.సావరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు గొడుగులు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

ఉండ్రాజవరం: మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకూ సంరక్షించి, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పారిశ్రామికవేత్త, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్‌కు చెందిన సుంకవల్లి చిరంజీవికుమారి పుట్టినరోజును పురస్కరించుకుని ఉండ్రాజవరం మండలంలోని కె.సావరం ఎంపీపీ పాఠశాల్లోని విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్సీ వంకా గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంక రవీంద్రనాథ్, తణుకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజకుమారి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని పాఠశాల ఆవరణలోను, కె.సావరం గ్రామంలోని పలు ప్రదేశాల్లోనూ మొక్కలు నాటారు. అనంతరం ఆ దంపతులను సర్పంచ్ నార్ని రామకృష్ణ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ కుంకట్ల వెంకటరత్నం, జోన్ చైర్మన్ చిట్టూరి సుజాత, స్వర్ణ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శేషారావు, మైత్రి లయన్స్ క్లబ్ మెంబర్ సతీష్ పాల్గొన్నారు.

కార్యకర్త మృతదేహానికి వనిత, తలారి నివాళులు



కనికెళ్ల విల్సన్ బాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: నీతి, నిజాయితీ గల కార్యకర్త పార్టీకి దూరం కావడం చాలా బాధాకరమని మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దూబచర్లలో సోమవారం రాత్రి బైక్‌తో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని మృతి చెందిన కొత్తగూడెం వాసి, వైఎస్సార్ సీపీ నాయకుడు కనికెళ్ల విల్సన్ మృతదేహానికి వారిద్దరూ మంగళవారం నివాళులర్పించారు. అంతకుముందు విల్సన్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి తాము ఎల్లపుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని డిజిటల్ అసిస్టెంట్ల వినతి

నిడదవోలు: తమకు పదోన్నతులు కల్పించాలని కోరుతూ డిజిటల్ అసిస్టెంట్లు మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, పదోన్నతులు, పే స్కేల్ గురించి వారు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న వారికి ఉన్న హై టెక్నికల్ క్వాలిఫికేషన్ల దృష్ట్యా రాష్ట్రంలోని 35 ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అర్హత, నైపుణ్యం కలిగిన వారిని ఆయా ప్రభుత్వ కళాశాలలు, విద్యాశాఖలో కంప్యూటర్ టీచర్లుగా తీసుకోవాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దుర్గేష్ డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళి, తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పొగాకు రైతులకు నేడు ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవం

- నలుగురు రైతులకు ఉత్తమ అవార్డులు
- ఒకరికి లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు
- టీఐఐ ఆధ్వర్యంలో నేడు ప్రదానం



సత్తి జగదీశ్వరరెడ్డి, లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు గ్రహీత, కృష్ణంపాలెం, దేవరపల్లి మండలం



కొర్లపాటి సత్యనారాయణ (అన్నవరం), ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, పెద్దాపురం, గోపాలపురం మండలం

దేవరపల్లి: ఏటా టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) ఆధ్వర్యంలో పొగాకు రైతులకు ఇస్తున్న ఉత్తమ రైతు అవార్డుల ప్రదానోత్సవం బుధవారం ఉదయం 10 గంటలకు దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో జరుగుతుంది. తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలోని ఐదుగురు రైతులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. వారిలో నలుగురికి ఉత్తమ రైతు అవార్డులు, ఒకరికి లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డు అందజేస్తారు. ఈ ప్రాంతంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించడం ఇదే తొలిసారి. 11 ఏళ్ల క్రితం రాజమహేంద్రవరంలో ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని దేవరపల్లి వేలం కేంద్రం పరిధిలోని కృష్ణంపాలెంకు చెందిన సత్తి జగదీశ్వరరెడ్డి లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. గోపాలపురం వేలం కేంద్రం పరిధిలోని పెద్దాపురం రైతు కొర్లపాటి సత్యనారాయణ (అన్నవరం) ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. అలాగే కొయ్యలగూడెం వేలం కేంద్రం పరిధిలో ఒకరికి, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలోని ఇద్దరు రైతులకు కూడా ఉత్తమ రైతు అవార్డులు ప్రదానం చేస్తారు. ఐటీసీ, జీపీఐ, ఎస్వీఎస్ పొగాకు ఎగుమతి సంస్థలు సంయుక్తంగా టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) ఆధ్వర్యంలో అవార్డులు అందజేస్తున్నాయి. పొగాకు సాగులో మెళకువలు, ఉత్పత్తి, దిగుబడులు, క్రిమి సంహారక మందుల నియంత్రణ, సాధించిన సగటు ధర వంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఆదర్శ రైతులను ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేస్తున్నారు. గతేడాది వరకూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రైతులకు కలసి ఒక వేదిక ఏర్పాటు చేసి అవార్డులు అందజేసేవారు. ఈ ఏడాది రెండు రాష్ట్రాల రైతులకు వేర్వేరుగా కార్యక్రమాలు ఏర్పాటు చేసి అవార్డులను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం, ఏలూరు ఎంపీలు దగ్గుబాటి పురంధేశ్వరి, పుట్టా మహేష్ కుమార్, గోపాలపురం, పోలవరం ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, చిర్రి బాలరాజు, పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ జి.వాసుబాబు, బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, సీటీఆర్ఐ డైరెక్టర్ మాగ్గాని శేషుబాబు హాజరవుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

వ్యాధులు ప్రబలకుండా చూడండి

తాళ్లపూడి: ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా, ఇతర వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వాదేశాలను పాటించాలని డీఎంఅండ్ హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని అన్నదేవరపేట, తాళ్లపూడి పీహెచ్‌సీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆసుపత్రుల సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాధారణ ప్రసవాలు చెయ్యాలని వైద్యులను ఆదేశించారు. వర్షా కాలం అంతా వైద్య సిబ్బంది అంతా అప్రమత్తంగా పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హారికా గుప్తా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు హెల్త్ సూపర్‌వెజర్లు, సిబ్బంది ఉన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర మాజీ హోం మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు, అభిమానులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు మృతి

ఇద్దరు మహిళలకు గాయాలు

పెరవలి: అతి వేగం ఒకరి ప్రాణాలు బలిగొనగా, మరో ఇద్దరు గాయపడడానికి కారణమైంది. పెరవలి ఏఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూలి పనులు చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న మహిళలు మంగళవారం రాత్రి మండలంలోని ఖండవల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి దాటుతున్నారు. అదే సమయంలో రావులపాలెం నుంచి తణుకు వైపు మోటార్ సైకిల్‌పై వేగంగా వస్తున్న కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు (59) ఆ మహిళలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన ఖండవల్లికి చెందిన కుంచె నాగమణికి, మరొక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఢీకొట్టిన వెంకటేశ్వరరావు మోటార్‌సైకిల్ పై నుంచి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఘటనా స్థలంలో కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. మృతుడు కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన వాడని ఏఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ ప్రసాదరావు తెలిపారు.

అతిసారంపై అవగాహన

నల్లజర్ల: అతిసార వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోతవరం అంగన్‌వాడీ కేంద్రం 48లో తల్లులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ ఇందిర మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పిల్లలకు వేడివేడి ఆహారాన్ని, కాచి చల్లార్చిన నీటినే అందించాలన్నారు. మురికిగుంటలు, వాననీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని రక్షిత మంచినీటి పథకాలను క్లోరినేషన్ చేయించాలని, పైపులైన్ల లీకేజీలు ఉంటే సమీప ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశాలు దుర్గ, ప్రమీల, బేబీ, నాగలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

నిడదవోలు రూరల్: కొవ్వూరు డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డీఎల్‌పీఓ వై.అమ్మాజీ అన్నారు. మండలంలోని పందలపర్రులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ డ్రైన్లలోని పూడికను తొలగించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయడంతో పాటు పైపులైన్ల లీకేజీలను వెంటనే అరికట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించి పంచాయతీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు కేవీ సుబ్బన్న, జి.ప్రసాద్, స్థానిక నాయకులు పులుమంతుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు ఊరట

నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్– 43తో నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఇసుక పాలసీ అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు నిబంధనలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలగకుండా ఉచిత ఇసుక అందిస్తామని శేషారావు పేర్కొన్నారు.

117 జీఓ రద్దు చేయాలి

నిడదవోలు రూరల్: విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నిడదవోలు మండల శాఖ అధ్యక్షుడు దానరాజు డిమాండ్ చేశారు. మండలంలోని తాడిమళ్ల గ్రామంలోని పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ సభ్యులుగా చేర్చుకునేందుకు మంగళవారం ఆయన పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల తగ్గింపునకు చర్యలు

నిడదవోలు రూరల్: మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు జి.వసంతలక్ష్మి, కె.సంధ్య సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం పీహెచ్‌సీలో వైద్య సేవలను, రికార్డులను టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరీ, ఎంపీహెచ్ఈఓ ఎ.రాజమోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, వైవీ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ వారికి బోనాల సమర్పణ



తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ వారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

నిడదవోలు రూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెం గ్రామంలోని కోటసత్తెమ్మ వారికి రాజమహేంద్రవరానికి చెందిన భక్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకుడు అప్పారావు శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులోగా కౌలుకార్డులు పొందాలి

గోపాలపురం: ఈనెల 30వ తేదీలోగా కౌలు రైతులు కౌలుకార్డులు పొందాలని ఏవో బి.రాజారావు సూచించారు. తహసీల్దార్ డి.వనజాక్షి అధ్యక్షతన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజారావు మాట్లాడుతూ వాస్తవ సాగుదారులను గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 30లోగా పంట సాగుదారు హక్కుపత్రాలు (కౌలుకార్డులు) పొందాలన్నారు. మండలంలో 6,210 మంది కౌలు రైతులు ఉన్నారని తహసీల్దార్ వనజాక్షి చెప్పారు. గ్రామాల వారీగా ఉన్న వాస్తవ కౌలు రైతులను గుర్తించి భూ యజమాని అంగీకారంతో కౌలు కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రేపు నిడదవోలు మండల సమావేశం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ మంగళవారం తెలిపారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.